# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ కడ్ ఈ రోజు ఆంధ్రప్రదేశ్ లోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు.
2. ఢిల్లీలో పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు.
3. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపడితే వాటిని తొలగిస్తామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు.
4. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లోనూ మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు.
5. ప్రస్తుత ప్రపంచ అవసరాలకు తగ్గట్లుగా 'ఫ్యూచర్ సిటీ' పేరుతో నాలుగో నగరానికి రూపకల్పన చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వెల్లడించారు.

==========================

భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ కడ్ ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు. తిరుపతి విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి, నెల్లూరులోని పోలీస్ మైదానానికి చేరుకుని, అక్కడ నుంచి వెంకటాచలం మండలం సరస్వతి నగర్‌లోని అక్షర విద్యాలయానికి వెళతారు. పూర్వ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడుతో కలిసి నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని సందర్శించి, యువతకు అందిస్తున్న వివిధ కోర్సులను పరిశీలిస్తారు. అనంతరం వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ కు చేరుకొని ట్రస్టు 23వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. ఉపరాష్ట్రపతి పర్యటన కోసం జిల్లా యంత్రాంగం విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. ఉపరాష్ట్రపతికి స్వాగతం పలకడంతో పాటు ఆయనతోపాటు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఇప్పటికే నెల్లూరు చేరుకున్నారు.

--------------------------

ఢిల్లీలో పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన పర్యటనలో భాగంగా కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులపై కేంద్ర మంత్రితో చర్చించారు. ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పలువురు పార్లమెంట్ సభ్యులు ఈ సమావేశంలో

పాల్గొన్నారు. రెండ్రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈరోజు సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో చంద్రబాబు నాయుడు సమావేశం కానున్నారు. ఆ తర్వాత హోం, ఆర్థికశాఖ మంత్రులతో విడివిడిగా సమావేశమవుతారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

ప్రస్తుత ప్రపంచ అవసరాలకు తగ్గట్లుగా 'ఫ్యూచర్ సిటీ' పేరుతో నాలుగో నగరానికి రూపకల్పన చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నిన్న ఢిల్లీలోని అధికార నివాసంలో ఫాక్స్‌కాన్ ఛైర్మన్ యంగ్ లియూతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ నగరానికి అనుబంధంగా అభివృద్ధి చేయబోతున్న నాలుగో నగరం 'ఫ్యూచర్ సిటీ'లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. నవతరం పరిశ్రమల అవసరాలు తీర్చే మానవ వనరులను అందించేందుకు అవసరమైన పాఠ్యాంశాల రూపకల్పనలో ప్రముఖ పారిశ్రామికవేత్తలను భాగస్వాములను చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నాలుగో నగరంలో పరిశ్రమలు పెట్టేందుకు ఫాక్స్‌కాన్ సంస్థకు అవసరమైన అన్ని అనుమతులు ఇవ్వడంతోపాటు అన్నిరకాలుగా సహకరిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

తెలంగాణ గవర్నర్ కోటా శాసనమండలి సభ్యులుగా తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షులు కోదండరామ్, పాత్రికేయులు అమీర్ అలీఖాన్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్‌లోని శాసనమండలి కార్యాలయంలో మండలి ఛైర్మన్ జి సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణం చేయించారు. అనంతరం కోదండరాం పాత్రికేయులతో మాట్లాడుతూ శాసన మండలిలో సభ్యుడిని కావడం సంతోషంగా ఉందని చెప్పారు. అవకాశం ఇచ్చిన గవర్నర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమకారులు, అమరవీరుల ఆకాంక్షల మేరకు పని చేస్తానని చెప్పారు.

---------------------------

తెలంగాణ గ్రూప్-1 సర్వీసుల ప్రధాన పరీక్షల సమయంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ - టీజీపీఎస్సీ మార్పులు చేసింది. 563 పోస్టుల భర్తీ కోసం అక్టోబరు 21 నుంచి 27 వరకు నిర్వహించే పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ వెల్లడించారు. గతంలో ప్రకటించిన సమయం కంటే అర్ధగంట ముందు పరీక్ష జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల సౌకర్యార్థం, ప్రధాన పరీక్షల నమూనా జవాబు పత్రాన్ని ఈ రోజు నుంచి టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఉంచుతామని, జవాబు పత్రం, హాల్ టికెట్‌పై ముద్రించిన సూచనలను అభ్యర్థులు తప్పనిసరి పాటించాలి అని నవీన్ నికోలస్ సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని అన్ని మున్సిపాలిటీల పరిధిలో నిబంధనలు అతిక్రమించి ఇళ్లు, భవనాలను నిర్మిస్తే వాటిని తొలగిస్తామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. నిన్న నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుధ్యం, పట్టణ ప్రణాళికావిభాగాలపై సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోని వివిధ రాష్ట్రాలలో భవన నిర్మాణాలకు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించి రాష్ట్రంలో నూతన విధానాన్ని తీసుకువస్తామని మంత్రి వెల్లడించారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, అగ్నిమాపక, వైద్య విభాగాల సమాచారాన్ని మున్సిపల్ విభాగంతో అనుసంధానం చేసి నగరాల్లో ప్రజలకు

సులభతరమైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. జనన, మరణ ధ్రువపత్రాల జారీలో చిన్నపాటి సమస్యలను పరిష్కరించి పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ విధానాన్ని పాటించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాల్లోనూ మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఎక్సరే యూనిట్‌ను స్థానిక నాయకులు , వైద్యులతో కలిసి మంత్రి నిన్న ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిడదవోలు పరిసర గ్రామాల ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించే ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సిఎస్ఆర్ నిధులను సేకరించి ఆసుపత్రిలో పూర్తిస్థాయి సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో క్షేత్రస్థాయిలో భూముల రికార్డులను పరిశీలించేందుకు రైతుల, ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు రోజుకి ఒక జిల్లా చొప్పున పర్యటిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా తెలిపారు. నిన్న విజయనగరం జిల్లాలో పర్యటించిన ఆయన కలెక్టర్ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడారు. విజయనగరం జిల్లా పర్యటనలో భాగంగా భోగాపురం మండలం పోలిపల్లి, బసవపాలెం గ్రామాలను సందర్శించామన్నారు. భూ సమస్యలకు సంబంధించి ప్రజలనుంచి వినతులను స్వీకరించామని పేర్కొంటూ...

..వాయిస్..30 సెకన్లు

---------------------------

సమాజసేవను ప్రతి ఒక్కరూ జీవితంలో భాగంగా చేసుకోవాలని భారత పూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్టులో నిర్వహించిన జైపూర్ ఫుట్ కృత్రిమ అవయవాల అమరిక శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించి చక్రాల కుర్చీలు, వాకర్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. సంపదతో పాటు నైపుణ్యంలో కొంత భాగాన్ని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కేటాయించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నైపుణ్యాభివృద్ధితోనే యువత సాధికారతతో పాటు, నవభారత నిర్మాణం త్వరితగతిన సాకారం అవుతుందని పేర్కొన్నారు.

---------------------------

వారాంతంలో వరుస సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్ళు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. తెలుగు రాష్ట్రాల మధ్య పలు తేదీల్లో ఎనిమిది ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు ప్రకటించింది. నర్సాపుర్– సికింద్రాబాద్, కాకినాడ –సికింద్రాబాద్, కాచిగూడ–తిరుపతి, కాచిగూడ –సికింద్రాబాద్‌ల మధ్య మొత్తం ఎనిమిది రైళ్ళు ఈ రోజు నుంచి ఈ నెల 20వ తేదీ వరకు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

---------------------------

కేంద్ర ప్రభుత్వం 70వ జాతీయ చలన చిత్ర పురస్కారాలను నిన్న ఢిల్లీలో ప్రకటించింది. ఉత్తమ చిత్రంగా మలయాళం సినిమా ఆట్టమ్ నిలిచింది. ఉత్తమ నటుడిగా 'కాంతార' చిత్రానికి గాను రిషబ్ శెట్టి పురస్కారాన్ని దక్కించుకున్నారు. ఉత్తమ నటి పురస్కారానికి తిరుచిట్రంబళం చిత్ర నటి నిత్య మేనన్, కచ్ ఎక్స్‌ప్రెస్ చిత్రం నటీమణి మానసి పరేఖ్ లు సంయుక్తంగా ఎంపికయ్యారు. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా తెలుగు చిత్రం కార్తికేయ-2కు పురస్కారం లభించింది. 2022 డిసెంబరు 31 నాటికి సెన్సార్ పూర్తి అయిన చిత్రాలకు ఈ పురస్కారాలను ప్రకటించారు.

-------------------------

వారం వారం ప్రపంచవ్యాప్తంగా జరిగిన వార్తల విశేషాలు, వివిధ అంశాల సమాచారంతో అంతర్జాతీయ విషయాలన్నింటిని తెలుగులో అందించేందుకు ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన వసుధైక కుటుంబం ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

======================